ఉదయం సుమారు ఏడు గంటలు కావస్తోంది.

డైరీ ఫారమ్‌కు ఎదురుగా, జాతీయ రహదారి మధ్యగా స్కూటర్ పడివుంది. శేషతల్పంపై పవళించే విష్ణుమూర్తిలా, హేండిల్‌పై ఆనుకుని విశ్రాంతి తీసుకుంటున్నట్లుంది. స్కూటరు చుట్టూరా వలయాలా రాళ్ళు వున్నాయి. స్కూటరు యాక్సిడెంట్‌కు గురైందన్న సంకేతంగా. స్కూటరు డేమేజ్ అయిన చిహ్నాలు కనిపించటం లేదు. స్కూటరు యజమానిగాని, అతని మనుష్యులుగాని ఎవరూ దగ్గర లేరు. యాక్సిడెంట్ స్పాట్‌లో, డ్యూటీలో వుండవలసిన పోలీసు కూడా కన్పించటంలేదు.

దారినపోయే ఒక్కొక్కరు స్కూటరు చుట్టూ మూగారు. స్కూటరు యాక్సిడెంట్ చర్చాంశం అయింది చేరిన జనానికి. వచ్చిపోయే సిటీబస్సులు, లైను బస్సులు ఆ జాగాలో నెమ్మదిగా పోతున్నాయి. ప్రయాణీకులు స్కూటరు వంక వింతగా కిటికీల్లోంచి తొంగి చూస్తున్నారు.




మూగిన జనంలో సంభాషణలు రకరకాలుగా సాగుతున్నాయి.

"పొగరుబోతు నాకొడుకెవడో స్పీడుగా పోతూ పడివుంటాడు. కాలో, చెయ్యో విరిగి వుంటాది. బండి వదిలేసి కేజీహెచ్‌కి వెళ్ళి వుంటాడు" అని ఒకరంటే, "కేజీహెచ్‌కి ఎందుకు? డైరెక్టుగా చావులమదుమే చేరుకుని వుంటాడు" అని ఇంకొకరు.

"బాబు డబ్బెట్టి బండి కొని వుంటే, ఈ కుర్రనా కొడుకు కన్నూ మిన్నూ కానక, పూలరంగడిలా యమ స్పీడు కొడుతుంటారు" అని ఒకరంటే, "బాబే కొనివ్వాలేటి? అత్తోరు తేరగా యిచ్చిన బండి మీద షోకు షోకు జోకులేసుకుని, పెళ్ళాంముందు స్పీడు చూపిస్తే, యాక్సిడెంట్లవ్వక ఇంకేంటౌతాయి?" అని ఇంకొకరు.

"యాక్సిడెంట్‌లో తగిలిన దెబ్బలు, నొప్పులు ఎలాగూ తప్పవు. వాటిమీద ఈ పోలీసోల్ల సొదొకటి" అని ఒకరంటే- "అందుకేనయ్యా! డ్యూటీలో వుండవలసిన పోలీసు కూడా కన్పించటంలేదు. డబ్బు గుంజటానికి బండోడి యింటికి వెళ్ళుంటాడు" అని యింకొకరు.

అటుగా సైకిలుపై పోతూన్న గురుమూర్తి జనాన్నిచూసి ఆగాడు. గుంపు మధ్యలోవున్న స్కూటరు నుచూసి ఆశ్చర్యపోయాడు. ఆ స్కూటరును తను ముందు ఎక్కడో చూసినట్టు గుర్తు. నెంబరుచూశాక ఆ స్కూటరు తను పనిచేసే స్టీలు ప్లాంటు ఆఫీసులో కొత్తగా చేరిన ఆఫీసరు మాధవరావు స్కూటరని రూఢి అయింది. యాక్సిడెంట్ వివరాలడిగితే, ఎవరూ సంతృప్తికరమైన సమాధానం చెప్పలేకపోయారు. మాధవరావు ఎక్కడ వున్నాడో, గాయాలెలా వున్నాయో, బ్రతికి వున్నాడో, లేదో అని రకరకాల ప్రశ్నలు. తన ప్రశ్నలకు సమాధానాలు తనే వెతుక్కుంటూ పోవాలి. గురుమూర్తికి మాధవరావు యిల్లు తెలుసు. ఆయన్ని తక్షణం చూడాలనిపించి, సైకిలు తీసుకుని బయలుదేరబోతున్నాడు

అప్పుడే సిటీ బస్సు లోంచి దిగిన వ్యక్తి జనాన్ని తప్పించుకుంటూ, స్కూటరు చుట్టూరా వున్న రాళ్ళ మధ్యకు చేరాడు. అతని చేతిలో ఒక డబ్బా మాత్రమే వుంది. ఆ వ్యక్తే మాధవరావు అని గురుమూర్తి ఇట్టే గుర్తుపట్టాడు. గురుమూర్తికి యిప్పుడు మరీ ఆశ్చర్యంగా వుంది.

స్కూటరుకు వేసిన స్టాండు లాక్, హాండిల్ లాక్ రెండూ తీశాడు మాధవరావు. స్కూటరును లేవనెత్తి స్టాండుపై నిలబెట్టాడు. ఆయిల్ టాంక్ మూతతీసి, డబ్బా లోంచి పెట్రోలు పోశాడు.

చుట్టూవున్న జనంతోపాటు,గురుమూర్తి కూడా మాధవరావు పనులను గమనిస్తున్నాడు. జనంలోవున్న గురుమూర్తిని చూసి, పలకరించినట్లుగా నవ్వాడు. స్కూటరు స్టార్టుచేసి, సీటుపై కూర్చున్న మాధవరావు.

స్కూటరు రన్నింగ్ కండిషన్‌లో వుంది. మాధవరావు కూడా క్షేమంగా వున్నాడు. మరి స్కూటరు రోడ్డుపై అలా పడి వుండడానికి కారణం ఏంటో గురుమూర్తికి తెలియటం లేదు. గుంపుగావున్న ఆ జనానికీ తెలియదు. మాధవరావును అదే ప్రశ్న అడిగాడు గురుమూర్తి.

"నిన్న భీమునిపట్నం షికారుగా వెళ్లాను. అక్కడే వర్షం పోయింది. తిరిగి వచ్చేటప్పుడు ఇక్కడకు చేరేసరికి పెట్రోలు అయిపోయింది. జేబులో డబ్బుల్లేవు. డబ్బులున్నా దగ్గర్లో పెట్రోల్ బంక్ లేదు. ఇంత దూరమూ స్కూటరును తోసుకుంటూ వెళ్ళటం కష్టం. అందుకే స్కూటరును జాగ్రత్తగా అలా పడుకోబెట్టి, చుట్టూరా రాళ్ళు పెట్టి విడిచి పెట్టేశాను.యాక్సిడెంట్ అయిన స్కూటరని దానిని ఎవరూ ముట్టుకోరు. చివరకు దొంగలు కూడా. పెట్రోలు తీసుకుని వచ్చాను. స్కూటరు ఇక్కడ క్షేమంగా వుంటుందని నాకు తెలుసు" అని చెప్పాడు మాధవరావు.

జనం ఆశ్చర్యంలోంచి తేరుకోకముందే మాధవరావు స్కూటరుతో వెళ్ళిపోయాడు.

—రేగిడి నాగభూషణరావు